క్లుప్తంగా

ట్రాఫిక్ అవస్థలు



శ్రీనివాస థియేటర్ రోడ్డులో భారీగా నిలిచిన వాహనాలు

రాజాం సిటీ: స్థానిక శ్రీనివాస థియేటర్ రోడ్డులో ట్రాఫిక్ అవస్థలు వెంటాడుతున్నాయి. నిత్యం ఇదే తంతు జరగడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపైనే కూరగాయల వ్యాపారులు, పండ్ల బళ్లు ఉంటుండడంతో ఈ సమస్య తలెత్తుతోందని పలువురు వాపోతున్నారు. ఇదేమని ప్రశ్నించిన వాహనదారులతో వాగ్వాదానికి దిగిన ఘటనలు కూడా చాలా ఉన్నాయంటున్నారు. బజారు, సంతమార్కెట్‌లకు వెళ్లే ప్రధాన రోడ్డు ఇదే కావడంతో ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

యుద్ధప్రాతిపదికన తాగునీటి బోర్ల మరమ్మతులు



సరసనాపల్లిలో బోర్లు బాగుచేస్తున్న మెకానిక్‌లు

రేగిడి: మండలంలోని సరసనాపల్లి, జోడిబందల, కోడిశ గ్రామాల్లో పాడైన తాగునీటి బోర్ల మరమ్మతులు యుద్ధప్రాతిపదికన చేపడుతున్నారు. ఎక్కడా తాగునీటి ఎద్దడి పరిస్థితులు లేకుండా మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లోని 67 బోర్లను బాగు చేయించామని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీచరణ్ తెలిపారు. పరిశుభ్రమైన నీటిని అందించేందుకు తాగునీటి వనరుల్లో క్లోరినేషన్ చేయిస్తున్నామన్నారు.

ఎరువుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు



ఎరువుల నిల్వలపై ఆరాతీస్తున్న ఏవో మురళీకృష్ణ

రేగిడి: అధిక ధరకు ఎరువులు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని ఏవో జి.మురళీకృష్ణ హెచ్చరించారు. మండలంలోని ఉంగరాడ మెట్ట దగ్గరున్న ఎరువుల దుకాణాల్లో ఆదివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన ఆయన.. షాపులోని ఎరువుల నిల్వలు, రికార్డులు, ధరల రిజిస్టర్‌పై ఆరాతీశారు. నాణ్యమైన ఎరువులను రైతులకు విక్రయించాలని, నిబంధనలు అతిక్రమించి వ్యాపారం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సమతా సైనిక్ దళ్ బలోపేతమే లక్ష్యం



మాట్లాడుతున్న సమతా సైనిక్ దళ్ సభ్యుడు శ్రీనివాసరావు

రాజాం సిటీ: సమతా సైనిక్ దళ్ బలోపేతమే పనిచేయాలని ఆ సంఘ రాజాం నియోజకవర్గ నాయకులు పొంద్రంకి శ్రీనివాసరావు, రెయ్యి రామకృష్ణలు పిలుపునిచ్చారు. మండలంలోని కంచరాం గ్రామంలో ఉన్న అయ్యప్ప కల్యాణ మండపంలో సమతా సైనిక్ దళ్ జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. పూర్తి స్థాయిలో గ్రామ, మండల, నియోజకవర్గాల కమిటీలను ఏర్పాటు చేయనున్నామని, సెప్టెంబర్ 24వ తేదీన అంబేడ్కర్ స్థాపించిన సమతా సైనిక్ దళ్‌కు వందేళ్లు పూర్తవుతున్న సందర్భాన్ని పురస్కరించుకుని, భారీగా నీలి కవాతు నిర్వహించనున్నామన్నారు. కార్యక్రమంలో దేబారిక రామప్పడు, బొత్స బుద్ధుడు, సిమ్మాల దుర్గాప్రసాద్, రేగిడి రామకృష్ణ, తేగల మోహన్, బత్తిన శంకర్, బత్తిన శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వారాల పండగ



ఘటాలకు పూజలు చేస్తున్న భక్తులు

బొబ్బిలి రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో వారాల పండగ ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. గ్రామస్తులంతా వారి గ్రామాల్లోని గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. ఏటా వరి నారు మడులు సిద్ధమైన తర్వాత దమ్ము పనులు చేసిన తర్వాత వరినాట్లు వేసే ముందు ఈ పండగ జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. పక్కి గ్రామంలో జరిగిన పండగలో మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పల నాయుడు, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత శంబంగి వేణుగోపాలనాయుడులు పాల్గొని, గ్రామదేవతకు విశేష పూజలు చేశారు. పంటలు బాగా పండి, ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించేలా ఆశీర్వదించాలని అమ్మవారిని వేడుకున్నారు.

కాలువలు ఇలా.. సాగునీరు ఎలా..?



ఆమిటి వద్ద పిచ్చిమొక్కలతో నిండిన తోటపల్లి రిజర్వాయరు పిల్లకాలువ



నందబలగ సమీపంలో కుచించుకుపోయిన పిల్లకాలువ

తెర్లాం: తోటపల్లి రిజర్వాయర్ ప్రధాన కుడికాలువ నుంచి గ్రామాల్లోని వందలాది ఎకరాలకు సాగునీరు అందించే పిల్లకాలువలు ఇప్పుడు చాలా అధ్వానంగా ఉన్నాయి. పెద్దఎత్తున పిచ్చిమొక్కలు, పూడికలతో నిండిన కాలువలే ఉండడంతో ఇలా కాలువలు ఉంటే సాగునీరు ఎలా అందుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని రాజయ్యపేట, ఆమిటి, నెమలాం, సుందరాడ, రేజేరు వద్ద పిల్లకాలువలు ఉండగా, వీటి ద్వారా నందబలగ, కుసుమూరు, రాజయ్యపేట, నందిగాం, రామన్న అగ్రహారం, ఆమిటి, కొరటాం, గొలుగువలస, కొల్లివలస, నెమలాం, ఎస్.బూర్జవలస, విజయరాంపురం, సుందరాడ, ఉద్దవోలు గ్రామాల్లోని వందలాది ఎకరాలకు ఏటా సాగునీరు అందుతోంది. అయితే గత కొన్నేళ్లుగా ఈ కాలువల్లో పూడికతీత పనులు చేపట్టకపోవడంతో కుచించుకుపోయిన కాలువల ద్వారా అంతంతమాత్రంగానే పంటపొలాలకు సాగునీరు వస్తోందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, ఖరీఫ్ సీజన్‌లోనే పిల్లకాలువలను బాగుచేసి, సాగునీరు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

తక్షణమే జీపీఎస్ రాజపత్రం రద్దు చేయండి



ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

రాజాం సిటీ: ప్రభుత్వం విడుదల చేసిన జీపీఎస్ రాజపత్రాన్ని తక్షణమే రద్దుచేయలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహన్‌రావు డిమాండ్ చేశారు. స్థానిక పట్టణంలోని అంబేడ్కర్ జంక్షన్ వద్ద యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన చేపట్టారు. సీపీఎస్ రద్దు చేసి, పాతపెన్షన్ విధానం పునరుద్ధరించాలని కోరారు. గత ప్రభుత్వం తీసుకువచ్చిన జీపీఎస్‌నే ప్రస్తుత ప్రభుత్వం పాత తేదీతో జీపీఎస్ విధానాన్ని అమలుచేస్తూ రాజపత్రాన్ని విడుదల చేయడం దుర్మార్గమన్నారు. ఈ జీవోను ప్రభుత్వం విడుదల చేయడమంటే ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులను మోసగించడమేనన్నారు. 2003 డీఎస్సీ ద్వారా నియామకం పొందిన ఉపాధ్యాయులందరినీ పాతపెన్షన్ విధానంలోకి తీసుకురావాలన్నారు. అనంతరం 54 జీవో కాపీలను దహనం చేసి, నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి బి.రామినాయుడు, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు ఎం.కృష్ణమూర్తి, యూటీఎఫ్ రాజాం మండలశాఖ అధ్యక్షులు ఎం.రమేష్, ప్రధాన కార్యదర్శి బి.నాగేశ్వరరావు, వంగర మండలశాఖ అధ్యక్షులు ఎం.ప్రసాద్, కె.శ్రీనివాసరావు, ఆర్.గణపతిరావు, జి.సింహాచలం, బి.రమేష్, వి.ప్రవీణ్‌కుమార్, పి.మురళి, పి.బాలకృష్ణ, ఎం.శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



ఆగూరులో పారిశుధ్య పనులు చేయిస్తున్న సర్పంచ్ అప్పారావు



రేగిడి: కాలువలోని పూడికలు తీస్తున్న కూలీలు

రాజాం: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని, ప్రతిఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు కోరారు. మండలంలోని ఆగూరు, గడిముడిదాం, నందబలగ గ్రామాల్లో సర్పంచ్‌లతో కలిసి గ్రామస్తులకు పరిసరాల పరిశుభ్రతపై ఆదివారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో మలేరియా, డెంగీ, టైఫాయిడ్, డయేరియా వంటి సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. జ్వరం వచ్చి రెండు రోజులైనా తగ్గకపోతే వెంటనే ఆస్పత్రిని సందర్శించాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ పరిసరాల పరిశుభ్రతకు పాటుపడాలన్నారు. మంచి ఆహారం తీసుకోవాలన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో సర్పంచ్‌ల పర్యవేక్షణలో పంచాయతీ కార్యదర్శులతో ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టారు.

రేగిడి: మండలంలోని వన్నలి గ్రామంలో సర్పంచ్ గార రమణ, పంచాయతీ కార్యదర్శి గోవిందరావుల పర్యవేక్షణలో పారిశుధ్య పనులు ఆదివారం చేపట్టారు. వర్షాకాలం నేపథ్యంలో అపరిశుభ్రత, నీటికాలుష్యం కారణంగా సీజనల్ వ్యాధుల బారినపడే అవకాశం ఉందని సర్పంచ్ తెలిపారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించి, ఆరోగ్యవంతమైన సమాజం నిర్మాణానికి కృషి చేయాలన్నారు.

చురుగ్గా ఖరీఫ్ సాగు పనులు

మండలంలో ఖరీఫ్ సాగు పనులు చురుగ్గా జరుగుతున్నాయి. అడపాదడపా కురుస్తున్న వర్షాలు వ్యవసాయానికి అనుకూలంగా ఉండడంతో చాలా గ్రామాల్లోని రైతులు దుక్కి పనులు, వరినారు తీతలు చేపడుతున్నారు. అక్కన్నఅగ్రహారం, ఉప్పర్నాయుడువలస, లక్ష్మీపురం, గోపింపేట, అంబఖండి గ్రామాల్లో ఏకంగా వరి ఉబాలు(ఉడుపులు) చేస్తున్నారు.

–రేగిడి



లక్ష్మీపురంలో ట్రాక్టరు సాయంతో దుక్కి పనులు చేస్తున్న దృశ్యం



వరి ఉబాలు వేస్తున్న మహిళా కూలీలు

వాటర్ ప్లాంట్ వితరణ



వాటర్ ప్లాంట్ సేవలు ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు నర్సింహులు, గ్రామపెద్దలు

రాజాం: మండలంలోని పెనుబాక గ్రామంలో ప్రజల తాగునీటి సౌకర్యార్థం అదే గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ జెడ్పీటీసీ సభ్యుడు బండి నర్సింహులు, ఆయన కుటుంబ సభ్యులు వాటర్ ప్లాంట్‌ను ఆదివారం వితరణ చేశారు. రెండు నెలల క్రితం తమ మాతృమూర్తి బండి సత్యవతి మరణించారని, ఆమె జ్ఞాపకార్థం తమ కుటుంబ సభ్యులమంతా కలిసి ఈ ప్లాంట్ ఏర్పాటు చేశామని జెడ్పీటీసీ తెలిపారు. రూ.2 లక్షల విలువైన ఈ తాగునీటి ప్లాంట్‌ను సచివాలయం వద్ద ఏర్పాటు చేశామని, రోజుకు ప్రతీ ఇంటికి 20 లీటర్ల నీటిని తీసుకువెళ్లవచ్చన్నారు. గ్రామ భూగర్భజలంలో 1800 వరకు టీడీఎస్ ఉండడంతో తాగునీటికి గ్రామస్తులు ఇక్కట్లు పడుతున్నారని, ఈ నేపథ్యంలో మంచి చేయాలనే ఆలోచనతో ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి, గ్రామస్తులకు అంకితమిస్తున్నట్లు జెడ్పీటీసీ కుటుంబ సభ్యులు ప్రకటించారు. అనంతరం వాటర్ ప్లాంట్ సేవలను జెడ్పీటీసీ ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ బండి బోడమ్మ, బింగి కృష్ణ, చీడి జగన్నాధం, చీడి కుమార్, గంగు ఈశ్వరరావు, సత్యవతి కుటుంబ సభ్యులు, గ్రామపెద్దలు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

సమస్య విని చర్యలు మరిచారు..



మాధవబజార్‌లో రోడ్డుపై ప్రవహిస్తున్న కాలువ మురుగునీరు

రాజాం సిటీ: స్థానిక మాధవబజార్ ప్రధాన రోడ్డులోని మురుగునీటి సమస్య నేటికీ పరిష్కారం కాలేదు. నాలుగు రోజుల క్రితం హడావుడిగా మున్సిపల్ కమిషనర్ ఆ ప్రాంతానికి వెళ్లి, సమస్యపై ఆరాతీశారు. ఆక్రమణలు తొలగిస్తేనే పూర్తి స్థాయిలో పూడికలు తీసేందుకు అవకాశం ఉంటుందని స్థానికులు ఆయనకు సూచించారు. దీంతో ఆక్రమణలు తొలగించకపోతే తామే తొలగిస్తామని కమిషనర్ దుకాణదారులకు హెచ్చరికలు జారీచేశారు. అయినా సమస్య పరిష్కారం కాకపోవడంతో దుర్గంధం భరించలేకపోతున్నామని పాదచారులు అంటున్నారు. కమిషనర్ సమస్య విని, చర్యలు మరిచారని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రోడ్డు బాగు చేయరూ?



అధ్వానంగా పిరిడి-అలజంగి జంక్షన్ రోడ్డు

బొబ్బిలి రూరల్: మండలంలోని పిరిడి, కారాడ, అలజంగి గ్రామాల కూడలి రోడ్డు బాగు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఇదే దారిలో పెద్దపెద్ద గోతులు ఉండడంతో ఎక్కడ ఏం ప్రమాదం జరుగుతుందోనని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి, రోడ్లు మరమ్మతులు చేపట్టేలా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

పుస్తక పఠనంతో విద్యార్థులకు మేలు



విద్యార్థులతో పుస్తకాలు చదివిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి



రామభద్రపురం: పుస్తక పఠనంపై అవగాహన కల్పిస్తున్న లైబ్రేరియన్ సత్యవాణి

తెర్లాం: ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులు పుస్తక పఠనం చేయడం ద్వారా వారికి ఎంతో మేలు జరుగుతుందని లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం అనే కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. గ్రంథాలయానికి విచ్చేసిన విద్యార్థులతో ఆయన పుస్తక పఠనం ఎలా చేయాలి, చదివిన విషయాన్ని ఎలా అర్థం చేసుకోవాలన్న విషయాలను తెలియజేశారు. అలాగే చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లోని మెలకులను ఆయన నేర్పించారు. మంచి పుస్తకం మంచి స్నేహితుడి కంటే గొప్పదని, చిన్నతనం నుంచే పుస్తకాలు చదవడాన్ని అలవాటుగా చేసుకోవాలన్నారు. పుస్తక పఠనం ద్వారా అపారమైన జ్ఞానం వస్తుందని, ప్రతీ విద్యార్థి తప్పనిసరిగా పుస్తక పఠనానికి ఆసక్తి చూపాలన్నారు. గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన చిల్డ్రన్స్ క్లబ్‌లో విద్యార్థులంతా చేరాలని, ప్రతిరోజూ గ్రంథాలయానికి వచ్చి, వార్తాపత్రికలు, కథల పుస్తకాలు, కాంపిటేటివ్ పుస్తకాలతో పాటు ఇతర పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నెమలాం హైస్కూల్ క్రాఫ్ట్, డ్రాయింగ్ ఉపాధ్యాయుడు విశ్వేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం: స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. గ్రంథాలయానికి విచ్చేసిన విద్యార్థులకు లైబ్రేరియన్ సత్యవాణి పుస్తక పఠనంపై అవగాహన కల్పించారు. అనంతరం పుస్తకాలు చదవడం కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రతీ విద్యార్థి చిన్నతనం నుంచే పుస్తకాలు చదవడాన్ని అలవాటుగా చేసుకోవాలని, పుస్తకాలు చదివితే అపారమైన జ్ఞానం లభిస్తుందన్నారు. గ్రంథాలయాలు విజ్ఞానభాండాగారాలని, గ్రంథాలయాల్లోని పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం నృత్యం, సంగీతం, చిత్రలేఖనం, వక్తృత్వం, స్పోకెన్ ఇంగ్లిష్, నాటికల ప్రదర్శనపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు.

'తల్లికి వందనం'తో కూటమి దగా

- వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్

రాజాం: తల్లికి వందనం పథకం పేరుతో కూటమి ప్రభుత్వం దగా చేస్తోందని వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ విమర్శించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి, మాట్లాడిన ఆయన.. ఎన్నికలకు ముందు చంద్రబాబు, లోకేష్, పవన్‌లు కలిసి ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అంతమందికి ఏడాదికి రూ.15 వేలు చొప్పున తల్లికి వందన పథకం పేరిట ఇస్తామన్నారని గుర్తుచేశారు. ఇప్పుడు అదే పథకంపై యూటర్న్ తీసుకుని, ఇంట్లో ఒక్క విద్యార్థికే రూ.15 వేలు ఇస్తామని చెబుతూ జీవో జారీ చేయడం ప్రజలను మోసగించడమేనని దుయ్యబట్టారు. సూపర్ సిక్స్ పేరిట ప్రకటించిన హామీలతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఇప్పటివరకు పాఠశాలలు ప్రారంభమైనా తల్లికి వందనం పథకం అమలు చేయలేదని, ఖరీఫ్ సీజన్ ఆరంభమైనా రైతుకు రూ.20 వేల ఆర్థికసాయం అందివ్వలేదని ధ్వజమెత్తారు. హామీలు ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నిస్తే పొంతనలేని సమాధానాలను కూటమి నేతలు చెబుతుండడం విడ్డూరంగా ఉందన్నారు. గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచే ఎన్నికల హామీలను అమలుచేసిందన్నారు. ఇప్పటి కూటమి సర్కారు ప్రతీ పథకం అమలుకు ఇంకా ఆలోచన చేస్తున్నాం.. విధివిధానాలు ఖరారు చేస్తున్నామని కాలయాపన చేయడం నమ్మిన ప్రజలను వంచించడమేనన్నారు. చంద్రబాబు ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని అమలుచేసి, మాట నిలబెట్టుకోవాలన్నారు.

మాజీ సీఎంపై అక్రమ కేసు ప్రభుత్వ కుట్రే..

మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అక్రమ కేసు నమోదు ముమ్మాటికీ కూటమి ప్రభుత్వం కుట్రేనని మండిపడ్డారు. సాక్షాత్తు సుప్రీంకోర్టు తప్పు పట్టినా, అప్పటి ఎంపీ రఘురాం ఫిర్యాదులో వాస్తవం లేదని తేల్చి చెప్పినా, ఆ కేసును అప్పుడే కొట్టేసినా మళ్లీ ఈ ప్రభుత్వం నిసిగ్గుగా, మూడేళ్ల తర్వాత ఐపీఎస్‌లతో పాటు జగన్‌మోహన్‌రెడ్డిపై, డాక్టర్‌పై కేసులు నమోదు చేయడమనేది కక్ష సాధింపు కాదా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని, దాడులతో కూటమి ప్రభుత్వం భయోత్పాతం సృష్టిస్తోందని ధ్వజమెత్తారు. ఇలాగే ప్రభుత్వం తీరు కొనసాగిస్తే ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి



కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న ఆనందో బ్రహ్మ డ్యాన్స్ అకాడమీ సభ్యులు

బొబ్బిలి: రామభద్రపురం మండలం, కొండకెంగువ పంచాయతీ, జీలికవలస గిరిజన గ్రామంలో ఆరునెలల చిన్నారిపై జరిగిన లైంగికదాడిని వ్యతిరేకిస్తూ ఆనందో బ్రహ్మ డ్యాన్స్ అకాడమీ సభ్యులు కొవ్వొత్తులతో నిరసన చేపట్టారు. స్థానిక శ్రీకళాభారతి మున్సిపల్ ఆడిటోరియంలో ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో నిందితుడిని కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భవిష్యత్‌లో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చట్టాలు, శిక్షలను పక్కాగా అమలు చేయాలని సభ్యులు కోరారు.

పసికందుపై లైంగికదాడి దుర్మార్గమైన చర్య



లైంగికదాడి ఘటనను ఖండిస్తున్న సీపీఎం నేతలు శంకరరావు, గోపాలం

బొబ్బిలి: రామభద్రపురం మండలం, కొండకెంగువ పంచాయతీ, జీలికవలసలో ఆరునెలల పసికందుపై లైంగికదాడి ఘటన చాలా దుర్మార్గమైన చర్య అని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు పొట్నూరు శంకరరావు, మండల కార్యదర్శి ఎస్.గోపాలం ఖండించారు. ఇదే విషయమై వారు ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ పసిపిల్ల అని చూడకుండా విచక్షణారహితంగా ప్రవర్తించిన ఆ వ్యక్తిని కఠినంగా శిక్షించాలని కోరారు. నిందితులకు కఠిన శిక్ష అమలుచేస్తేనే మరెప్పుడూ ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉంటాయన్నారు. ప్రభుత్వాలు ఇటువంటి దుర్మార్గుల పట్ల కఠిన నిర్ణయాలు అమలు చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఇదిలా ఉండగా, పసికందుపై లైంగికదాడికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కె.పుణ్యవతి డిమాండ్ చేశారు.

పామాయిల్ సాగుపై రైతుల ఆసక్తి



రామన్నఅగ్రహారం వద్ద సాగు చేస్తున్న పామాయిల్ తోట

తెర్లాం: మండలంలోని పలు గ్రామాల్లోని రైతులు వాణిజ్య పంటల సాగుపై ఎక్కువగా దృష్టి సారిస్తున్నారు. గతంలో ఏటా వరితో పాటు ఇతర పంటలను సాగుచేసేవారు. గతకొన్నేళ్లుగా చాలా గ్రామాల రైతులు పామాయిల్ తోటల సాగుపై ఆసక్తి కనబరుస్తుండడం విశేషం. మండలంలోని నందబలగ, కుసుమూరు, రామన్నఅగ్రహారం, వెలగవలస, అంట్లవార, లింగాపురం, పూనువలస తదితర గ్రామాల్లో వందలాది ఎకరాల్లో పామాయిల్ తోటలు సాగుచేస్తున్నారు. తక్కువ ఖర్చుతో అధిక లాభం వచ్చే పంటల్లో పామాయిల్ పంట ఒకటి కావడంతో రైతులు ఆ పంట సాగు చేసే దిశగా అడుగులు వేస్తున్నారు. పామాయిల్ తోటల పెంపకానికి సంబంధించి, గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏపీ మైక్రో ఇరిగేషన్ పథకం ద్వారా బిందుసేద్యం పరికరాలను రాయితీపై సరఫరా చేయడంతో పామాయిల్ సాగును రైతులు లాభదాయకం చేసుకోవడం సులభమైందని పలువురు చెబుతున్నారు. ప్రస్తుతం మండల వ్యాప్తంగా సాగులో ఉన్న పామాయిల్ తోటలు ఆశాజనకంగానే ఉన్నాయి.